## గడువు

నాకు అంతా అయోమయంగా వుంది. భయంగా కూడా వుంది.

'ఎలా వుండేవాడిని? ఇలా అయిపోయానేమిటి?

నాకీ సంగతి ఎనిమిది నెలల క్రితం తెలిసింది. అపుడు తేలిగ్గా కొట్టి పారేశాను. కాని గడువు సమీపిస్తున్న కొద్దీ భయం నన్ను ఆక్రమించుకుంటోంది.

ఇంక, అయిదు దినాలు గడువుంది.

ఆరో దినమే డిశెంబరు పదహారు. ఆవేళ అంతపనీ జరిగిపోతే? ఇంకేమైనా వుందా?

నాకు రాబోయే జనవరికి ముప్పయి ఆరేళ్ళు నిండుతాయి. ముప్ఫయి ఆరు ముసలి వయస్సుకాదు, నాకు ఏ రోగమూ లేదు.

నీరసం, రక్తపోటు, మధుమేహం లాటి మెల్లగా తినేసే రోగాలు అసలే లేవు. రెండుపూటలా హాయిగా తింటూ చక్కగా ఉద్యోగం చేసుకుంటున్నాను. ప్రస్తుతానికి పిడుగులా ఉన్నాను!

అయితే రాత్రికి పిడుగులా వుండి ఉదయానికి 'హరీ' మన్న వాళ్ళు బోలెడంత మంది నాకు తెలుసు. కృష్ణమూర్తి పేపరు చదువుతూ కుర్చీలో కునికేశాడు. చదువుకునే రోజుల్లో ఓ లెక్చరరు పాఠం చెపుతూ బోర్డు వైపుకు తిరిగి అలాగే కుప్పలా కూలి ప్రాణాలు విడిచేడు.

చావు ఏ రూపంలో వస్తుందో, ఎలా వస్తుందో ఎవరు చెప్పగలరు?

నేను చనిపోతే అనురాధ గతి ఏంకాను? ఇద్దరు పిల్లలూ ఏమైపోతారు?

ఈ భయంతోనే యాభయివేల రూపాయలకు జీవిత భీమా చేయించేను. అయితే ఈ డబ్బు నేను లేని లోటు వాళ్ళకి తీరుస్తుందా?

అయినా, నాకుచావాలని లేదు. కాని చావు ముంచుకొస్తే తప్పించుకోటం సాధ్యమేనా?

'సాధ్యమే' అన్నాడు ఆవేళ పండిత శాస్త్రి. నేను ఆ దినం ఆ విషయం తేలిగ్గా తీసిపారేశాను.

అసలు జరిగినది ఇది!

ఏడాది ఎనిమిదినెలల క్రితం మా మేనమామ గారబ్బాయి వివాహానికి చింతలూరు వెళ్ళేను. వెళ్ళి మరునాడు మధ్యాహ్నం భోజనాలు ముగించి అరుగుమీద పేకాడుకుంటున్నాం. "నువ్వు వెంకట్రాయుడి కొడుకువి కదూ" అన్న గొంతు విని ప్రక్కకు చూశాను. గుండ్రని ముఖం, నుదుట అరచేతి వెడల్పున విభూతి రేఖలు, కనుపాపల వెనుకవింత తేజస్సు, నన్ను చూసి చిరునవ్వునవ్వేడు. "నా పేరు పరమేశ్వర శాస్త్రి. అందరూ పండిత శాస్త్రి అని పిలుస్తారు. మీ నాన్న నేను దూరపు బంధువులం

కలిసే చదువుకున్నాం. మహానుభావుడు చచ్చి ఏ లోకానవున్నాడో మా గొప్పగా బతికేడు" అన్నాడు.

ఏం బదులు చెప్పాలో తోచక లేచి నిలబడి సమస్కరించేను.

"ఈ పేకాట ఎప్పుడే వుండేదే, అలా రెండడుగులు వేద్దాం. నీతో మాట్లాడాలి రా" అన్నాడు.

కాదనలేకపోయాను. పేక ముక్కలు పడేసి పరమేశ్వర శాస్త్రి గారి వెనక బయలుదేరాను.

వీధి చివర మలుపు తిరిగి చెరువు గట్టెక్కి పొలాల ప్రక్క నుండి ఆలమూరు తీసుకు వెళ్ళేడాయన. "ఇక్కడే మా ఇల్లు మా ఆవిణ్ణి పిల్లల్నీ చూద్దువుగాని రా" అంటూ దారిలో బోలెడు సంగతులు చెప్తూ రెండు మైళ్ళు నడిపించేడు. వాళ్ళ ఇంటి అరుగుమీద చాపవేసి ఉపవిష్టుణ్ణి చేసి దాహం తీర్చుకోమని మజ్జిగ తేట ఇచ్చేడు. ఇంట్లో వాళ్ళతో పరిచయాలు పూర్తి అయ్యాక కొంతసేపు మా నాన్నగారి ఘనత గురించి చెప్పుకొచ్చేడాయన. తరువాత "నీ జన్మ నక్షత్రం జనన సమయం చెప్పు" అంటూ లోనికి వెళ్ళి పాతపంచాంగాల కట్ట పట్టుకు వచ్చేడు.

"నాకు జోస్యం మీద నమ్మకం లేదు" అన్నాను నవ్వుతూ.

"మహా మహులందరూ ఇలా అన్నవాళ్ళే. జమీందార్లందరికీ జాతకాలు చెప్పేను. ఘడియలతో సహా అన్నీ చెప్పినట్లు జరిగేయి. శాస్త్రాన్ని తేలికగా కొట్టి పారెయ్యకు. నక్షత్రం చెప్పు" అంటూ వేధించుకు తిని నక్షత్రం, పుట్టిన సమయం చెప్పించుకొని అరగంటలో చక్రం వేశాడు.

ఈలోగా వాళ్ళమ్మాయి తెచ్చి ఇచ్చిన పనస తొనలు తింటూ పేపరు చూస్తూ కాలం గడిపేను. ఆయన మరో పావుగంటసేపు ఏవేవో కూడికలు కట్టి ఆఖరున ముక్కున వేలేసుకున్నాడు. "ఇంకో ఏడాది ఎనిమిది నెలల్లో నీకు మారకం వుంది" అన్నాడు బరువుగా ఊపిరి పీలుస్తూ.

"అంటే ఉద్యోగం మారిపోతావా?" అన్నాను నవ్వుతూ.

"మారకం అంటే మృత్యువు" గంభీరంగా అన్నాడు.

నా అజ్ఞానానికి సిగ్గేసింది. తరువాత ఒక్క నిముషం భయం కూడా వేసింది. అయినా దాన్ని బయటపడనివ్వలేదు.

విషయం మీద అస్సలు నమ్మకం కుదరనట్టు ఎగతాళిగా నవ్వి "ఇంకేం జరుగుతుందో చెప్పండి" అన్నాను.

"ఇంక నీకు జాతకం చెప్పటం అనవసరం. సరిగ్గా ఏడాది ఎనిమిది నెలల్లో అంటే వచ్చే డిశంబరు పదహారు అష్టమంలో శని ప్రవేశిస్తాడు. మిగిలిన గ్రహాల గతులు కూడా బాగాలేవు. ఆ వేళ ఘోర విపత్తు జరుగుతుంది. అయితే శనికి శాంతి చేయిస్తే

మేలు చేకూరే అవకాశం వుంది."

"అయితే, నా నక్షత్రం వాళ్ళందరూ ఆ దినం 'హరీ' మంటారా?" అడిగేను.

"ఒక్క జన్మనక్షత్రాన్ని బట్టి చెప్పలేం. పుట్టిన ఘడియలు, ఇంకా ఇతర వ్యవహారాలు లెక్కలోకి తీసుకోవాలి. ఇదిగో మా ఆవిడ జాతకం చూడు" అంటూ పంచాంగాల కట్ట మధ్యలోంచి పసుపుతో 'ఇంటూ' మార్కు పెట్టిన మరో చక్రం తీశాడు.

"జన్మ నక్షత్రం నీదీ మా ఆవిడది ఒక్కటే. అయితే అదే సమయానికి శని మా ఆవిడకు మహర్దశ పట్టిస్తాడు. నా యోగంలో ఆ సమయానికి స్త్రీ మూలంగా ధన లాభం వుంది. అంటే ఆ సమయంలో మా ఆవిడకు ఏవో ఆస్తిపాస్తులు కలిసి వస్తాయన్నమాట. నీకు చెడుచేయబోయే శని మా ఆవిడకకు ఆ సమయంలోమేలు చేస్తాడు" అంటూ శాస్త్రంలోని రీతులు, లోతులు వివరించి చెప్పుడాయన. "శనికి శాంతి చేయించాలంటే సుమారు రెండు వందల రూపాయలు ఖర్చవుతుంది. నువ్వు సిద్ధమైతే రేపు చేయిద్దాం.ఈ పూళ్ళో అయినా ఫర్వాలేదు. మందపల్లి వెళ్ళి, శనీశ్వరాలయంలో చేయిస్తే మరీ మంచిది" అంటూ ఆఖరున సలహా ఇచ్చేడు.

ఇది నా జేబులో వున్న కాస్త డబ్బు ఒడికేసే వ్యవహారంలాగే కనిపించింది. శాంతులూ, జాతకాలూ వీటి మీద నాకు నమ్మకం లేదని చెప్పి, ఆయన్ని వదిలించుకు చక్కావచ్చాను.

అప్పట్లో ఒకటి రెండు గంటలు ఈ విషయం గురించి ఆలోచించి తరువాత మరిచిపోయినా, ఆయన చెప్పిన మారకం తేదీ డిశెంబరు పదహారు మాత్రం మనసులో వుండిపోయింది. క్రమేణా గడువుదగ్గర పడుతున్న కొద్దీ భయం నామనసును ఆక్రమించుకోటం ప్రారంభించింది. అనూరాధ నన్ను నిత్యం గమనిస్తూనే వుంది. నేనేదో విషయం మనసులో వుంచుకుని మధనపడుతున్నానని గ్రహించి అడుగుతూనే వుంది. ఆమెను కూడా మనస్తాపానికి గురి చేయటం ఇష్టంలేక విషయం చెప్పకుండా దాటేసుకుంటూ వస్తున్నాను. కాని రోజు రోజుకూ విషయం భరించలేనిదిగా తయారవుతోంది. మనసు భయంతో నిండిపోతోంది. నేను ఆలోచనలతో క్రిందా మీద పడుతుండగా అనూరాధ వచ్చింది నా దగ్గరకు.

"నేను పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోతున్నాను" అంది ఏడుస్తూ.

"అదేం?" అన్నాను అర్థం కాక ఆమె ముఖంలోకి చూస్తూ..

"ఎందుకిక్కడ? నాకు మీరు ఏమీ చెప్పటంలేదు. మీరు పిచ్చివాడిలా తయారవుతున్నారు. నేను మీకు ఏమీ సహాయం చేయలేకపోతున్నాను" ఎక్కిళ్ళమధ్య మాట్లాడింది.

అనురాధను అనునయించేను. అసలుసంగతి అంతా పూసగుచ్చినట్లు వివరించేను అనూ షాక్ తిన్నట్లయింది. తరువాత శోకాలు ప్రారంభించింది. ఆమెను

ఊరుకోబెట్టడానికి గంట పట్టింది నాకు.

పండిత శాస్త్రి సంగతి ఆమెకు బాగా తెలుసుట. చాలా మంచి పేరున్న వాడట. ఇలాటి విషయాలు ఆయన చెప్తే తేలికగా కొట్టి పారెయ్యడానికి వీల్లేదంది "మీరు ఈ వేళే బయలుదేరి ఆలమూరు వెళ్ళండి. శనికి ఆయనచేత శాంతి చేయించండి. అయన్ని తీసుకుని మందపల్లి అలయానికి వెళ్తే మరీ మంచిది. డబ్బు చాలదనుకుంటే ప్రస్తుతానికి నా బంగారు గాజులు అమ్మెయ్యండి. మీకు నమ్మకం లేకపోయినా, నాకు ఇలాటి విషయాల మీద బోలెడు నమ్మకం ఉంది" అంటూ సలహాలు చెప్పింది.

నేను మాట్లాడకుండా వుండిపోవటం చూసి వెళ్ళకపోతే ఉరిపోసుకు చస్తానని బెదిరించింది.

నాకూ మనసులో పీకు ప్రారంభమయింది. మరునాడు ఉదయం లేచి ఆలమూరు బయలుదేరక తప్పింది కాదు.

బస్సు దిగేసరికి పదకొండు గంటలయింది. ఎండ నెత్తి మాడ్చేస్తుంది. ఈ దినమే ఆయన్ని ఒప్పించి శాంతి జరిపే యత్నాలు చేయించాలి.

మలుపు తిరిగి పండిత శాస్త్రి ఇల్లు సమీపించి రోడ్డుమీదే ఆగిపోయాను.

'ఇంటిముందు ఈ తతంగమంతా ఏమిటి? చీరుతున్న తడపలు, రాజేస్తున్న కుండలోని నిప్పు, ఎందుకో అర్థమవుతున్నాయి. నోటమాటరాక ఎంతసేపు నిలబడిపోయానో నాకే తెలీదు. పండిత శాస్త్రిగారి భార్య ప్రేతానికి స్నానం చేయించి, నుదట కుంకుమ అద్ది పాడె మీదకు చేర్చేరు. శాస్త్రి పిచ్చివాడిలా అరుగు మీద నిలబడి చూస్తున్నాడు.

నాకు మతిపోయినట్లయింది.

పండిత శాస్త్రి మాటలు గుర్తుకొచ్చేయి. "మా ఆవిడకు శని మహర్దశ పట్టిస్తాడు. నాకు స్త్రీ వలన ధనలాభం వుంటుంది.."

నాకు శాంతి జరిపించవలసిన అవసరం కనబడలేదు! వెనక్కు తిరిగి బస్సుస్టేండువైపు నడిచేను. ★

(నీలిమ, మార్చి 1978)